క్లుప్తంగా

నిత్యావసరాలు అందజేత



సత్తెనపల్లి: రుగ్మతలతో బాధపడేవారికి చేయూతనివ్వడం అభినందనీయమని పట్టణ ఎస్ఐ ఎం. సంధ్యారాణి అన్నారు. వెంగళరెడ్డి నగర్ 11వ వార్డులో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సొపాటి దుర్గమ్మకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మీడియా ఆర్గనైజేషన్ ద్వారా నెలకు సరిపడ నిత్యావసరాలను మంగళవారం అందించారు. ఎస్ఐ సంధ్యారాణి తన చేతుల మీదగా అందజేశారు. ఆర్గనైజేషన్ నేషనల్ లీగల్ అడ్వైజర్ కోటగిరి లక్ష్మణ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి గోపి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఖాళీ దుర్గ, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, సైదా వలి, గర్నెపూడి చిన్న ఉన్నారు.

బ్రాహ్మణులపై దాడులు హేయం



సత్తెనపల్లి: బ్రాహ్మణులపై దాడి చేస్తే అట్రాసిటీ లాంటి బలమైన చట్టం ప్రభుత్వాలు తీసుకురావాలని బ్రాహ్మణ ఐక్య వేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ పేర్కొన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ అర్చకుడి మీద జరిగిన దాడిని మంగళవారం ఆయన ఖండించారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని శివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్చకులు మీద దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా బలమైన చట్టాన్ని ప్రయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బ్రాహ్మణ జాతి భవిష్యత్తు కాపాడాలని కోరారు. అర్చక సంఘ నాయకులు అమంచి రవికుమార్, పురుషోత్తమ శర్మ, సాధు శివ ప్రసాద్, దీవి శేషుబాబు, మార్కండేశర శర్మ, తులసి కృష్ణ బట్టర్, సంపత్ కుమార్, బాలాజీ, బ్రాహ్మణ నాయుకులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



సత్తెనపల్లి: పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని సీనియర్ న్యాయవాది చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయనతో పాటు న్యాయవాదులు ఎ.వి.కృష్ణారెడ్డి, ఆకుల నాగార్జున, కోటగిరి లక్ష్మణ్, పోత్తూరి హరీష్ కుమార్, 11వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ కుమార్ ఓటర్ల నమోదు దరఖాస్తులను డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా చిట్టా మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల వైఎస్సార్ సీపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మహనీయుడు గాంధీ



సత్తెనపల్లి: సత్యాగ్రహమే ఆయుధంగా, అహింసే మార్గంగా పోరాడిన మహనీయుడు మహాత్మా గాంధీ అని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ ఉపాధి సెంటర్, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్కిల్ హబ్ సెంటర్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి, ట్రైనర్ షేక్ మీరాభి, ప్రిన్సిపల్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదల విద్యార్థుల ప్రతిభ



మాదల(ముప్పాళ్ళ): మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారని పాఠశాల ప్రదానోపాధ్యాయుడు పి.రమేష్ మంగళవారం తెలిపారు. బి.అంకమ్మరావు, పి.నాగరాజు, బాలికల విభాగంలో ఎస్.శ్రావ్య ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.సాంబశివరావు ఉపాధ్యాయులు అభినందించారు.

అక్రమాలకు 'ప్లానింగ్'

- ప్రజా ప్రతినిధికి రూ.10 లక్షలు ముట్టజెప్పినట్లు ప్రచారం
- అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు రూ.5 లక్షల డిమాండ్
- మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు
- ఆదాయం కోల్పోతున్న పురపాలక సంఘం



పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణం

సత్తెనపల్లి: సత్తెనపల్లి మున్సిపాల్టీ పరిధిలో అనుమతులకు.. భవన నిర్మాణాలకు ఏ మాత్రం పొంతన ఉండటం లేదు. నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ప్రతినిధులతో కలిసి అందినకాడికి దండుకుంటూ చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఫలితంగా మున్సిపాల్టీ ఆదాయం కోల్పోతోంది.

అనుమతులకు విరుద్ధంగా సెల్లార్

పాత బస్టాండ్ ఏరియా పరిధిలోని శ్రీనివాస్ మహల్ రోడ్డులో కమర్షియల్ ఏరియాలో సర్వే నంబరు 197–2సీ1లో ఆరు సెంట్ల స్థలంలో స్టిల్ట్ జీ+2 భవనం నిర్మించేందుకు నిర్మాణదారుడు మున్సిపల్ టౌన్ ప్లానింగ్‌లో అనుమతులు తీసుకున్నాడు. కానీ, నిబంధనల అతిక్రమించి సెల్లార్ నిర్మాణం చేపట్టేందుకు 15 అడుగులు తవ్వకాలు చేపట్టాడు. ప్రొక్లెయిన్‌లతో మట్టి తవ్వకాలు జరపాలంటే తప్పనిసరిగా మైనింగ్ అధికారులు అనుమతులు ఉండాలి. ఈ స్థలానికి తూర్పున 36 అడుగులు, దక్షిణం 40 అడుగుల రహదారులున్నాయి. దీనిలో స్టిల్ట్ జీ+2 భవన నిర్మాణం చేపట్టాలంటే దక్షిణం వైపు ఆరు అడుగులు, తూర్పు వైపున మరో ఆరు అడుగులు స్థలం సెట్‌బ్యాక్ నిమిత్తం వదిలి పెట్టాలి. కేవలం దక్షిణం వైపు మాత్రమే మూడు అడుగులు వదిలి నిర్మాణం చేపడుతున్నారు.



పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో సెల్లార్‌కు పొక్లెయిన్‌తో తవ్వకాలు

డీల్ కుదరని భవనాలపై చర్యలు

నిర్మాణం ప్లాన్ ప్రకారం చేపడుతున్నారా..? లేదా..? అని చూడాల్సిన టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, ప్లానింగ్ కార్యదర్శి, సంబంధిత బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ చేష్టలుడిగి చూస్తున్నారన్న విమర్శలున్నాయి. ముందస్తుగా డీల్ కుదిరితే అక్రమ నిర్మాణాల వైపు చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీల్ కుదరక పోతే రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టినా సరే హడావుడిగా చర్యలు చేపడుతున్నారు. పాత బస్టాండ్ ఏరియాలోని అక్రమ నిర్మాణం పై 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్‌కుమార్ మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ప్రశ్నిస్తే కొత్తగా వచ్చానని టీపీఎస్ కె.సునీత, పరిశీలిస్తామని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి చెప్పారే తప్పా.. ఆ పనులను కనీసం పర్యవేక్షించ లేదంటే ఏ స్థాయిలో నిర్మాణదారుడు ప్రభావితం చేశాడోనని అందరూ చర్చించుకుంటున్నారు.

ప్రజా ప్రతినిధికి రూ.10 లక్షలు...

ప్రస్తుతం పాత బస్టాండ్ ఏరియాలో నిర్మిస్తున్న అక్రమ కట్టడానికి అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రజాప్రతినిధికి రూ.10 లక్షలు నిర్మాణ దారుడు ముట్ట చెప్పాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ నిర్మాణాన్ని చూసి చూడనట్లుగా వ్యవహరించాలని అధికారులకు ప్రజాప్రతినిధి నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు రూ. 5 లక్షలు ఇవ్వాలని నిర్మాణ దారుడిని డిమాండ్ చేస్తున్నారని సమాచారం. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో నిబంధ నల ప్రకారం నిర్మాణాలు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పెదకూరపాడు: మండలంలోని రామాపురం, బుచ్చిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి శాంతి మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశు సంవర్ధక అసిస్టెంట్ శ్రీలక్ష్మి శాఖలోని పథకాల గురించి రైతులకు వివరించారు. గ్రామ ఉద్యాన సహాయకులు బి.రాజు, వీరసింహం పాల్గొన్నారు.

రాజుపాలెం: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతి ఉన్నందున నివారణకు లింగాకర్షన బుట్టలను వాడాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెం, బలిజేపల్లి గ్రామాల్లోని పత్తి పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మొక్కపాడు పశువైద్యాధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు రమేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ క్షేత్ర పరిశీలన చేసి రైతులతో గ్రామ సభలు నిర్వహించారు. ఈ–పంట నమోదు, కౌలుదారులకు గుర్తింపు కార్డులు, పీఎం కిసాన్ రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీపై వివరించారు. గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ సాయిశ్రీ పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను తెలిపారు. ఆవులవారిపాలెం గ్రామ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగుల నివారణకు చర్యలు

బెల్లంకొండ: పైర్లలో రసం పీల్చే పురుగులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాయపాలెం, మాచాయపాలెం గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్తి, కంది పైర్లను పరిశీలించి, రసం పీల్చి పురుగుల నివారణ చర్యలను రైతులకు వివరించారు. పశు వైద్యాధికారి బాలకష్ణారెడ్డి గాలికుంటు వ్యాక్సినేషన్, పశువుల్లో యద లక్షణాలు, కత్రిమ గర్భధారణ గురించి తెలియజేశారు. మార్కెటింగ్ శాఖ అధికారి రఫీ పత్తి, కంది పంటల కనీస మద్దతు ధరలు గురించి తెలిపారు. సర్పంచ్ భుక్యా నాగమ్మబాయి, శ్రీను నాయక్, మేళం శ్రీరామమూర్తి, యల్లమందరావు, సూకల కోటేశ్వరరావు, గుడిశె కొండయ్య, ఎంపీఈవో రహ్మతుల్లా పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్ళూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ అన్నపూర్ణాంబికా విశ్వేశ్వర స్వామి దేవాలయంలో దసరా మహోత్సవాలు అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ శనివారం వరకు ఘనంగా జరుగుతాయని శ్రీ శివసాయి ట్రస్టు సభ్యులు మంగళవారం తెలిపారు. అమ్మవారికి రోజుకో అలంకారంతో నవరాత్రులలో ప్రతిరోజూ రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీలలిత సహస్ర నామాలతో, ఖడ్గమాల, శ్రీసూక్త, దుర్గా సూక్తాలతో కుంకుమార్చన జరుగుతుందని తెలిపారు. ప్రత్యేకంగా 12న సాయంత్రం విజయదశమి రోజు ఆలయం పక్కనే ఉన్న చెరువులో అమ్మవారికి తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 13వ తేదీ రాత్రికి అమ్మవారికి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. మహిళలు, బాలికలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని, శ్రీదుర్గామాత ఆశీస్సులు పొందాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహం రుద్రాభిషేకం

పెదకూరపాడు: 75 తాళ్లూరు అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో మంగళవారం మాస శివరాత్రి పురస్కరించుకొని భక్తులు భక్తిశ్రద్ధలతో మహన్యాస రుద్రాభిషేకాలు, ఏకాహం రుద్రాభిషేకం శివలింగానికి అయోధ్య స్వామి ఉత్సవ విగ్రహానికి భక్తులతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు ఆదిత్యశర్మ పాల్గొని, మాట్లాడారు. లోక కల్యాణం కోసమే ఏకాహం రుద్రాభిషేకాలు నిర్వహించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. మాస శివరాత్రి పురస్కరించుకొని మహన్యాస రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే గ్రామంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపు పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జై బూన్‌బీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎక్స్ అఫిషీయోగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సంకటి నాగ మల్లేశ్వరితో పాటు మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో, పంచాయతీ కార్యదర్శులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇరు కుటుంబాల దాడులపై కేసులు నమోదు

బెల్లంకొండ: పెంపుడు కుక్క, ఇంటి ముందు ఉన్న సైడు కాలువ విషయంలో రెండు కుటుంబాలు ఘర్షణకు దిగి, ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మండలంలోని ఎమ్మాజీగూడెం గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ ఎం.రాజా వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నారుమళ్ల రామకోటి, ఇంటి పక్కనే ఉన్న రాజమ్మ కుటుంబ సభ్యుల మధ్య కొద్ది రోజులుగా చిన్న విషయాల్లో వివాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. రాత్రి ఇరు కుటుంబాలు గొడవ పడుతూ, ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. రామకోటి కుటుంబ సభ్యులు పలువురికి స్వల్ప గాయాలు కావడంతో, సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామకోటి కుటుంబ సభ్యులు ఆరుగురిపై, రాజమ్మ కుటంబానికి చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి

బెల్లంకొండ: పంట నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి గంజిమాల రవిబాబు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.20 వేలను వెంటనే ఇవ్వాలని కోరారు. బెల్లంకొండ క్రోసూరు రోడ్డుకు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేసి గుంతలు పూడ్చాలన్నారు. మండల కార్యదర్శిగా చిన్నం పుల్లారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరు మల్లేశ్వరి, సైదయ్య పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు

నకరికల్లు: మాసశివరాత్రి వేడుకలను నర్శింగపాడు మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలుగ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

93శాతం పింఛన్‌ల పంపిణీ

ముప్పాళ్ళ: మండలంలోని 93శాతం పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగిందని ఎంపీడీవో పీజే విలియమ్స్ మంగళవారం తెలిపారు. మొత్తం 6,173 మంది లబ్ధిదారులకు 5,745 మందికి పింఛన్ సొమ్ము అందించామన్నారు.

క్రోసూరు: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ మంగళవారం 98 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో బి.మహేష్‌బాబు తెలిపారు. 8,638 మంది లబ్ధిదారుల్లో 8,465 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక



సత్తెనపల్లి: అనంతపురం జిల్లాలో వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా స్థాయి కరాటే పోటీల ఎంపికలు మంగళవారం జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు వి.రుత్విక్, కె.కార్తీక్‌వర్మ, ఆకాష్, ఎస్.సుహాస్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధానో పాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి, వ్యాయామోపాధ్యాయులు ఎస్.అచ్చిరెడ్డి, అరుణా జ్యోతి, పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

వీఆర్వో అదృశ్యంపై కేసు నమోదు



ఎస్.మల్లికార్జునరావు

ముప్పాళ్ళ: విధులకు వెళ్లిన తమ కుమారుడు, వీఆర్వో కనిపించకుండా పోయాడంటూ అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలంలోని పలు దేవర్లపాడు గ్రామానికి చెందిన సత్తెనపల్లి మల్లికార్జునరావు ఐదు సంవత్సరాలుగా నార్నెపాడు గ్రామ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధులకు హాజరైన మల్లికార్జునరావు సాయంత్రం ఆరు గంటల వరకు గ్రామ సచివాలయం వద్దే ఉన్నాడని, ఆ తర్వాత ఎవరికీ చెప్పకుండా కనిపించకుండా పోయాడంటూ తల్లి సత్తెనపల్లి నాగేంద్రమ్మ ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆర్థిక సమస్యల కారణంతోనే ఇల్లు వదిలి వెళ్లాడని పోలీసులు తెలిపారు.

కోరిన వారందరికీ పనులు కల్పించాలి



బెల్లంకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించాలని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఏపీడీ పి.నారాయణ తెలిపారు. మంగళవారం బెల్లంకొండలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనాన్ని కూలీలకు అందించాలని తెలిపారు. ఉపాధి పనులలో ఫీల్డ్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలని, పనులకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. బుధవారం అన్నీ గ్రామాలల తప్పనిసరిగా గ్రామ సభలను నిర్వహించాలని సూచించారు. ఈ గ్రామ సభల ద్వారా 2025–26 సంవత్సరానికి సంబంధించిన పనులను గుర్తించాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో కోటమ్మ, టీఏ చిరంజీవి నాయక్, సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం

అచ్చంపేట: పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు హెచ్‌ఎం చిగురుపాటి కల్యాణి సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో మంగళవారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛ హి సేవ, స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతపై వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంశా పత్రం, బహుమతులు ప్రదానం చేశారు. జనచైతన్య సమితి కార్యదర్శి అన్నవరపు స్టాలిన్‌బాబు, రమావత్ బద్దూనాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొల్లవరం(ముప్పాళ్ళ): బొల్లవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం మంగళవారం జరిగింది. విద్యార్థులతో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. డీబీఆర్సీ ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటరమణ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కోటిరెడ్డి, సచివాలయ సిబ్బంది పి.రాంబాబు, రమ్యకృష్ణ, అయ్యప్ప, అనురాధ, వీఆర్వో సంజీవరావు పాల్గొన్నారు.

రాజుపాలెం: రాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డీబీఆర్‌సీ ఏరియా కో–ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు శైలజ విద్యార్థులు భోజనం చేసే ముందుగా చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు శివబాబు, శ్రీనివాసరావు, దత్తు విద్యావతి పాల్గొన్నారు.

అమరావతి: స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి.ఇందిరా ప్రియదర్శిని అన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జనచైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రశంసా పత్రాలను, బహుమతులను అందించారు. . ఉపాధ్యాయులు స్వాతి, దేవమణి పాల్గొన్నారు.

క్రోసూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో గత నెల 28న వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం జి.రామాంజనేయులు పాల్గొన్నారు. వ్యాస రచనలో సీహెచ్ అలేఖ్య, సీహెచ్ విజయ, వి.సాత్విక్, చిత్రలేఖనంలో యు.చంద్రకాంజలి, ఎం. భూమి, ఆర్.బిందు గెలుపొందినట్లు వివరించారు. జన చైతన్య సమితి నిర్వాహకులు సాంబశివరావు, సమితి కార్యదర్శి స్టాలిన్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీలో ప్రాధాన్యం లేదు

- కష్టపడిన వారికి ఇదేనా మీరిచ్చే గుర్తింపు
- కుంకలగుంట సర్పంచ్ భర్త పార్టీలో చేరికపై నిరసన
- 300 కుటుంబాలు దూరమవుతాయని బహిరంగ ప్రకటన



కుంకలగుంట గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామ తెలుగుదేశం పార్టీలో అంతర్గతపోరు మొదలైంది. పార్టీలో కొత్తవారిని చేర్చుకోవడం పట్ల టీడీపీలోని ఒకవర్గం పెట్రోల్ సీసాలతో తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. కుంకలగుంట గ్రామ సర్పంచ్ భర్త సుంకర ముత్తయ్య ఎమ్మెల్యే సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సోమవారం నిరసన గళం విప్పారు. పనిచేసే వారికి పార్టీలో ప్రాధాన్యత లేదని మండిపడ్డారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో పెట్రోల్ సీసాలు చేతబట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పనిచేసే వారికి ప్రాధాన్యం కల్పించడం లేదని అందుకే సుమారు 300 కుటుంబాలు టీడీపీని వీడనున్నాయని సోషల్ మీడియాలో ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం ఎస్సీ కాలనీకి రాకున్నా నిస్వార్థంగా పార్టీకి పనిచేసి గెలుపునకు సహకరించామని పేర్కొన్నారు. ఇవాళ పనిచేసిన వారికి ప్రాధాన్యం లేదన్నారు. దీంతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో పాటు ఆపార్టీ స్థానిక నాయకుల్లో కలకలం మొదలైంది.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు రూ. చెక్కు అందజేత

సత్తెనపల్లి: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం చేపట్టారు. సత్తెనపల్లి రూరల్ మండలంలో 10,772 మంది పింఛన్‌దారులకు గాను 10,541 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. 97.9 శాతం పింఛన్ల పంపిణీ నమోదైంది. ఇంకా 231 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. అలాగే సత్తెనపల్లి పట్టణంలో 6,259 మందికి గాను 6,142 మందికి పింఛన్లు పంపిణీ చేయగా 98.1 శాతం పింఛన్ల పంపిణీ నమోదైంది. ఇంకా 117 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో రూ. 10 లక్షలతో వద్దులకోటిరెడ్డి నగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాంపౌండ్ వాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో గర్నెపూడి రోడ్ లోని ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జూనియర్ కళాశాల నిర్వాహకులు రూ. 25 వేల చెక్కు సీఎం సహాయ నిధికి విరాళంగా మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు అందజేశారు. ఆయా కార్యక్రమాలల్లో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ వెలుగూరి సుబ్బరాయుడు, ప్రిన్సిపల్ గీతాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉన్నారు.

ఇసుక లారీలు పట్టివేత

అచ్చంపేట: మండలంలోని తాడువాయి వద్ద ఇసుక లోడ్‌తో ఉన్న రెండు లారీలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట ప్రసాద్ మంగళవారం తెలిపారు. తాడువాయి వద్దగల కృష్ణా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు.

క్రోసూరు సర్కిల్‌లో 10 మద్యం షాపులు

క్రోసూరు: క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్టేషన్ పరిధిలో 10 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్‌సీఐ టి.తులసి మంగళవారం తెలిపారు. క్రోసూరు మండలంలో 4, అచ్చంపేట– 4, బెల్లంకొండ –2 షాపులు ప్రారంభించేందుకు లైసెన్సులు ఈ నెల 12న ఇవ్వనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. 11న నరసరరావుపేటలోని టౌన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ లాటరీ తీస్తారన్నారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేయవచ్చని, ధరావతు రూ.2 లక్షలని చెప్పారు. లాటరీలో లైసెన్స్ పొందిన వారు మండలంలో షాపు ఎక్కడైనా పెట్టుకోవచ్చునన్నారు. క్రోసూరు, అచ్చంపేట మండలాలల్లో వార్షిక లైసెన్సు ఫీజు రూ.65 లక్షలు, బెల్లంకొండలో రూ.55 లక్షలని చెప్పారు.

సత్తెనపల్లి సర్కిల్‌లో..

సత్తెనపల్లి: కొత్త మద్యం షాపులు ఈ నెల 12న ప్రారంభం కానున్నాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి సర్కిల్ పరిధిలోని సత్తెనపల్లి టౌన్‌లో–7, సత్తెనపల్లి రూరల్‌లో–4 (ధూళిపాళ్ళ, రెంటపాళ్ళ, ఫణిదం, కొమెరపూడి), ముప్పాళ్ళ మండల పరిధిలో–1 (చాగంటి వారిపాలెం) రాజుపాలెం మండలంలో–2 (రాజుపాలెం, గణపవరం), మద్యం షాపులు ఉంటాయన్నారు. ఇవి కాక కొత్తగా రెండు మద్యం దుకాణాలు రానున్నాయన్నారు. నకరికల్లు మండలంలో–5 (గుళ్ళపల్లి, నకరికల్లు, చల్లగుండ్ల, దేచవరం, కుంకలగుంట) మొత్తంగా నియోజకవర్గ వ్యాప్తంగా 21 మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, నకరికల్లు మద్యం దుకాణాలకు వార్షిక లైసెన్స్ ఫీజు రూ. 65 లక్షలు, ముప్పాళ్ళ, రాజుపాలెం మండలాల్లోని రూ. 55 లక్షలు గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా సత్తెనపల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.